పాలకవర్గం కొలువుదీరేదెన్నడో..?

- జనవరిలో రద్దయిన జన్నారం మార్కెట్ కమిటీ
- 10 నెలలు గడుస్తున్నా నోచుకోని కొత్త పాలకవర్గం
- ఎదురుచూస్తున్న ఆశావహులు



జన్నారం మార్కెట్ కమిటీ కార్యాలయం

జన్నారం: రైతుల ధాన్యం అమ్మకంలో తోడ్పడుతూ, రైతులకు వెన్నుదన్నుగా నిలిచే జన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం రద్దయ్యి పది నెలలు గడుస్తోంది. అయినా ఇప్పటికీ కొత్త పాలకవర్గం కొలువుదీరలేదు. జన్నారం మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం జనవరిలో రద్దయింది. అప్పటి నుంచి ఇప్పటివరకు మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ఏర్పాటు కాలేదు. కాగా కమిటీ ఏర్పాటుపై ఆశావహులు ఎదురుచుస్తున్నారు.

పెరుగుతున్న ఆశావహులు..

జన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిపై మండలంలో ఆశావహులు పెరుగుతున్నారు. ఈసారి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఎస్సీలకు రిజర్వ్ కావడంతో కాంగ్రెస్ పార్టీలో పని చేస్తున్న సీనియర్ ఎస్సీ నాయకులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేసిన సీనియర్ నాయకులు, సంవత్సరాల కాలంగా పార్టీని నమ్ముకుని పని చేస్తున్న నాయకులు కమిటీ చైర్మన్ పదవిపై ఆశలు పెట్టుకున్నారు. నూతన పాలకవర్గం ఏర్పాటు చేస్తే కనీసం డైరెక్టర్ పదవి దక్కుతుందనే ఆశతో మరికొందరు నాయకులు ఉన్నారు. ఇటీవల ఇతర మండలాల్లో మార్కెట్ కమిటీలు కొలువుదీరడంతో స్థానిక నాయకులు పదవుల కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. చైర్మన్ పదవి కోసం పోటీపడుతున్న వారిలో ధర్మారంకు చెందిన దుర్గం లక్ష్మీనారాయణ, చింతగూడకు చెందిన మేకల మాణిక్యం, రేండ్లగూడకు చెందిన కరుణాకర్, పొనకల్‌కు చెందిన మంద రాజేశ్‌ల పేర్లు ప్రముఖంగా విన్పిస్తున్నాయి.

పర్యవేక్షణ కరువు..

రైతులు అమ్మకం చేసిన ధాన్యం నిల్వ ఉంచేందుకు మార్కెట్ యార్డులో గోదాములు, కవర్ షెడ్లు, మైదానం వంటి సౌకర్యాలు సమకూర్చారు. పాలకవర్గంతో పాటు సిబ్బంది సైతం నిత్యం మార్కెట్‌యార్డులోని సౌకర్యాలను పర్యవేక్షించేవారు. కాని గత పది నెలలుగా మార్కెట్ కమిటీ రద్దు కావడంతో పర్యవేక్షణ కరువైంది. గోదాములు మూడు ఉండగా అందులో రెండు గోదాములకు చిన్న మరమ్మతులు చేయాల్సి ఉండడంతో వృథాగా ఉంటున్నాయి. ఒక గోదామును సివిల్ సప్లయ్ శాఖకు అద్దెకు ఇచ్చారు. కమిటీ కార్యాలయానికి నిత్యం తాళం వేసి ఉండటంతో రాత్రి మందుబాబులకు అడ్డాగా మారింది. సాయంకాలం మందుబాబులు మద్యం తాగి సీసాలు ఇతర సామగ్రి అక్కడే పడేస్తుండడంతో అపరిశుభ్రత ఏర్పడుతోంది.

మొత్తం 18 మందితో పాలకవర్గం..

జన్నారం మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ పాలకవర్గంలో 18 మంది సభ్యులుంటారు. ఇందులో 12 మంది రైతులు కాగా, ఇద్దరు ట్రేడర్స్, ఒక సర్పంచ్, పీఏసీఎస్ చైర్మన్, వ్యవసాయ శాఖ అధికారి, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి పాలకవర్గంలో సభ్యులుగా ఉంటారు. ఇందులో 12 మంది రైతులలో ఒకరిని చైర్మన్‌గా, మరొకరిని వైస్ చైర్మన్‌గా నియమించి మిగితా వారు డైరెక్టర్లుగా ఉంటారు. కాగా చైర్మన్, వైస్ చైర్మన్‌లతో పాటుగా 10 మంది డైరెక్టర్ల నియామకం ఎమ్మెల్యే కనుసన్నల్లో జరుగుతుంది.

త్వరలో కొత్త పాలకవర్గం



మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని త్వరలో ఏర్పాటు చేస్తాం. నియోజకవర్గంలో ఒక్కొక్కటిగా మార్కెట్ కమిటీ పాలకవర్గాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. మరో నెల రోజుల్లోగా కమిటీల ఏర్పాటు చేయిస్తా. కష్టపడిన వారికి, పార్టీని నమ్ముకున్న వారికి ప్రాధాన్యత ఉంటుంది. – వెడ్మ బొజ్జు పటేల్, ఎమ్మెల్యే

యువత క్రీడల్లో రాణించాలి


ఏసీపీని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

భీమిని: యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ అన్నారు. బుధవారం కన్నెపల్లి మండలంలోని రెబ్బెనలో క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. కన్నెపల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పప్పుల రామాంజనేయులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ క్రికెట్ టోర్నమెంట్‌కు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బెల్లంపల్లి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింగరావు, తాండూరు సీఐ కుమారస్వామి, ఎస్సై గంగారాం, కాంగ్రెస్ నాయకులు, క్రీడాకారులు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజారక్షణ పోలీసుల బాధ్యత


మాట్లాడుతున్న ఎస్సై కిరణ్‌కుమార్

తాండూర్: ప్రజలకు రక్షణ, భద్రత కల్పించడం పోలీసుల బాధ్యత అని ఎస్సై కిరణ్‌కుమార్ అన్నారు. మంగళవారం రాత్రి తాండూర్ మండలం కాసిపేట గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్తులతో సమావేశమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎస్సై మాట్లాడుతూ ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టామన్నారు.

క్లుప్తంగా

'మహనీయుల చరిత్ర తెలుసుకోవాలి'


మాట్లాడుతున్న జడ్జి అసదుల్లా షరీఫ్

లక్సెట్టిపేట: విద్యార్థులు మహనీయుల చరిత్ర తెలుసుకోవాలని స్థానిక మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో చిల్డ్రన్స్ డే సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం వ్యాసరచన పోటీలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, ఏజీపీ వేల్పుల సత్యం, న్యాయవాదులు రాజేశ్వర్ రావు, అక్కల శ్రీధర్, సురేందర్, సత్తన్న, ప్రదీప్‌కుమార్, శివశంకర్, సజని, రెడ్డిమల్ల ప్రకాశం, సిబ్బంది పాల్గొన్నారు.

'దళారులకు ధాన్యం అమ్ముకుని మోసపోవద్దు'


కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న అధికారులు

బెల్లంపల్లి: దళారులకు ధాన్యం అమ్ముకుని మోసపోవద్దని బెల్లంపల్లి మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ చింతం స్వామి, ఎంపీడీవో మహేందర్ అన్నారు. బుధవారం బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి గ్రామంలో డీఆర్‌డీఏ ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. మండల వ్యవసాయ అధికారి ప్రేమ్‌కుమార్, ఏపీఎం శ్యామల, ఏఈవో అంజలి, సీసీలు రామకృష్ణ, సుందరేష్, మండల సమాఖ్య అధ్యక్షురాలు స్వప్న, కొనుగోలు కమిటీ సభ్యురాలు శ్రీలత, రైతులు, వీవోఏ తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో విఫలం'


మాట్లాడుతున్న రఘునాథ్

దండేపల్లి: హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ ఆరోపించారు. దండేపల్లిలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం కార్యకర్తలతో కలిసి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి ఏడాది దగ్గర పడుతున్నా హామీలు అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. హామీలను వెంటనే అమలు చేయాలని లేదంటే ప్రజల పక్షాన పోరాడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు రైతులకు అవగాహన

వేమనపల్లి: వరి, పత్తి అమ్మకం విషయంలో రైతులు పాటించాల్సిన నాణ్యత ప్రమాణాలు, సన్న వడ్ల బోనస్, హార్వెస్టర్ ఆర్పీఎం తదితర అంశాలపై గురువారం నెన్నెల రైతువేదికలో రైతులకు అవగాహన కార్యక్రమం ఉంటుందని మండల వ్యవసాయాధికారి వీరన్న తెలిపారు. జిల్లాకు చెందిన ఉన్నతాధికారులు రైతులకు అవగాహన కల్పిస్తారన్నారు. సమావేశానికి రైతులు ఉదయం 10గంటల లోపు హాజరు కావాలని సూచించారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

దండేపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో బుధవారం 32 వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిని లక్సెట్టిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రేంచంద్ ప్రారంభించారు. కార్యక్రమాల్లో ఏపీఎం బ్రహ్మయ్య, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ ఆరీఫ్, డైరెక్టర్లు, ఐకేపీ సిబ్బంది, వీవోఏలు, మహిళ సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత


చెక్కు అందజేస్తున్న అధికారులు

నస్పూర్: పట్టణ పరిధిలోని సీసీసీ ఆర్కే 5 కాలనీ శ్రీసాయి వృద్ధాశ్రమ నిర్వాహకులకు ఎన్‌పీడీసీఎల్ మంచిర్యాల శాఖ తరఫున రూ. 20 వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఈ గంగాధర్, డీఈ కై సర్, అధికారులు రాజేశం, వేణుగోపాల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మాలల హక్కుల సాధనే ముఖ్యం


పాదయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి, రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్

జైపూర్: సీఎం రేవంత్‌రెడ్డి గడ్డం కుటుంబంలో ఒక్కరికి మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చారని కానీ తనకు మంత్రి పదవి కన్నా మాలల అభివృద్ధి, హక్కుల సాధనే ముఖ్యమని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి అన్నారు. ఎస్సీ వర్గీకరణ రద్దుకు మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ చేపట్టిన పాదయాత్ర బుధవారం ఇందారం చేరుకుంది. పాదయాత్రలో పాల్గొన్న చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ మాట్లాడుతూ కొందరు నాయకులు రాష్ట్రంలో మాలలను తక్కువ చేసి మాట్లాడుతున్నారని, మాలలు బయటకు రావాల్సిన సమయం వచ్చిందన్నారు. వచ్చే నెల 1న హైదరాబాద్‌లో నిర్వహించే బహిరంగసభకు మాలలు పెద్దఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

మహా పాదయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

దండేపల్లి: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ గత నెల 25 నుంచి డిసెంబర్ 1 వరకు చేపట్టిన మహా పాదయాత్ర పోస్టర్‌ను దండేపల్లి ప్రెస్‌క్లబ్ కార్యాలయంలో బుధవారం మాల మహానాడు నాయకులు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ పాదయాత్ర ఈనెల 15న దండేపల్లి మండలం గూడెంకు చేరుకుంటుందన్నారు. నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని పాదయాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రేంచంద్, మాలమహానాడు మండల అధ్యక్షుడు దయాకర్, నాయకులు శ్రీనివాస్, వసంత్, మోహన్‌దాస్, రాజన్న, రాజారావ్, పెద్దయ్య, సాగర్, వెంకటేశ్, ఏసన్న, దాస్ పాల్గొన్నారు.

సీసీరోడ్డు, డ్రెయినేజీ పనులు ప్రారంభం

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధి 33వ వార్డులో బుధవారం సీసీ రోడ్డు, డ్రెయినేజీ పనులకు భూమిపూజ చేశారు. మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు, చైర్‌పర్సన్ శ్వేత హాజరై కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. రూ.3 లక్షల అంచనాతో పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. వార్డు కౌన్సెలర్ పోలు ఉమ, మున్సిపల్ డీఈ సాయికిరణ్, టీవో అశ్రిత్, స్థానిక బస్తీవాసులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


పనులు ప్రారంభిస్తున్న నాయకులు

'అటవీ అధికారులు తీవ్రంగా కొట్టారు'

జన్నారం: కట్టెల కోసం కూలీకి వెళ్లినందుకు స్మగ్లింగ్ చేస్తున్నవంటూ తనను తీసుకెళ్లి అటవీ అధికారులు తీవ్రంగా కొట్టారని జన్నారం మండలం పుట్టిగూడ గ్రామానికి చెందిన దళితుడు శత్రాజుల లక్ష్మణ్ ఆరోపించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 9న బాదంపల్లి గ్రామానికి చెందిన జాడి రాజంకు కావాల్సిన పొయ్యిల కట్టెల కోసం కూలీగా వెళ్లినట్లు తెలిపారు. అడవిలో కట్టెల బండిని అటవీ అధికారులు పట్టుకున్నారన్నారు. బుధవారం తెల్లవారుజామున 3 గంటలకు అటవీ అధికారులు ఇంటికి వచ్చి తనను వెంట తీసుకెళ్లి తీవ్రంగా కొట్టారని ఆరోపించారు. ఫారెస్ట్ రేంజ్ అధికారి సుష్మారావును వివరణ కోరగా, కలప స్మగ్లింగ్‌కు పాల్పడడంతోనే లక్ష్మణ్‌ను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని, అతడిని కొట్టలేదన్నారు. లక్ష్మణ్ కాల్ డాటా పరిశీలిస్తే పెద్ద నాయకుల హస్తం ఉన్నట్లు తేలిందని పేర్కొన్నారు. కాగా అటవీశాఖ అధికారులు తనను కొట్టడంతో పాటు కులం పేరుతో దుర్భాషలాడారని లక్ష్మణ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం

దండేపల్లి: మండలంలోని మాదాపూర్ గ్రామానికి చెందిన చల్ల రాకేశ్ ఇటీవల ఆత్మహత్య చేసుకోగా బాధిత కుటుంబానికి మిత్రులు ఆర్థికసాయం చేశారు. రాకేశ్ మిత్రులు రూ.29వేల ఆర్థిక సాయాన్ని బుధవారం అతడి తల్లిదండ్రులకు అందజేశారు.

తాగునీరు వృథా



మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని కేకే–5 గని పక్క నుంచి శంకర్‌పల్లి వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన ఉన్న డ్రింకింగ్ వాటర్ పైప్‌లైన్ లీకేజీకి గురై తాగునీరు వృథాగా పోతోంది. ఏళ్ల కింద వేసిన పైపులు పాడై పోవడం వలన ఎక్కడపడితే అక్కడ లీకేజీలు ఏర్పడుతున్నాయి. అధికారులు వెంటనే లీకేజీలకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మోడల్ లైబ్రరీ ఏర్పాటు


మాట్లాడుతున్న ఎంఈవో కృష్ణమూర్తి

భీమిని: రూమ్ టూ రీడ్ ఇండియా ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం భీమిని ఎంపీపీఎస్ పాఠశాలలో మోడల్ లైబ్రరీని ఎంఈవో కృష్ణమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడల్ లైబ్రరీలో అన్ని రకాల కథల పుస్తకాలు, పఠనా సామగ్రి విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఎచ్‌ఎంలు వెంకటస్వామి, విజయ, ఉపాధ్యాయులు సంధ్యారాణి, స్వాతి, దుర్గరాజు, లిటరసీ ఫెసిలేటర్‌లు మధు, సుచరిత తదితరులు ఉన్నారు.

వరిలో నాణ్యతా ప్రమాణాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఏఈవో

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఆస్నాద గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో వరిలో నాణ్యతా ప్రమాణాలపై ఏఈవో సాగర్ రైతులకు అవగాహన కల్పించారు. హార్వెస్టర్‌తో వరి కోత కోసే సమయంలో ఆర్పీఎం 18గా ఉంచాలని తెలిపారు. అలాగే పత్తిలో నాణ్యతా ప్రమాణాలపై వివరించారు.

ఆనంద నిలయానికి చేయూత

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని శ్రీశ్రీనగర్‌లో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆనంద నిలయం అనాధ, వృద్ధాశ్రమానికి ఇటకారి సత్యనారాయణ, వసంతలు వారి కూతురు జన్మదినాన్ని పురస్కరించుకుని రూ. 20 వేల కిరాణ సామగ్రిని బుధవారం అందజేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ మాజీ కోశాధికారి పడాల రవీందర్ పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘం కార్యవర్గం

భీమారం: మండల కేంద్రంలోని బీసీ కాలనీ ముదిరాజ్ సంఘం కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సుంకరి భీమేశ్, సలహాదారునిగా దబ్బెట ధర్మయ్య, ప్రచార కార్యదర్శిగా పిట్టల రాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మత్స్యకారులకు అండగా ప్రభుత్వం

- చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి
- గొల్లవాగు ప్రాజెక్ట్‌లో చేపపిల్లలు విడుదల

భీమారం: మత్స్యకార సంఘాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం గొల్లవాగు ప్రాజెక్ట్‌లో కలెక్టర్ కుమార్‌దీపక్‌తో కలిసి ఆయన చేప పిల్లలు విడుదల చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లోని చెరువుల్లో చేపలు పెంచేందుకు ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలను అందజేస్తుందన్నారు. చేపలను మార్కెటింగ్ చేసేందుకు సహకార సంఘాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని 145 చెరువుల్లో 20.74 లక్షలు చేపపిల్లలు మంజూరు చేసినట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా గల 3 ప్రాజెక్ట్‌ల్లో 28.91లక్షల చేపపిల్లలు కేటాయించామన్నారు. భీమారంలోని గొల్లవాగు ప్రాజెక్టుకు 4.95 లక్షల చేపపిల్లలు కేటాయించగా, 41వేలు విడుదల చేసినట్లు తెలిపారు. ముదిరాజ్ మత్స్యకార్మిక సహకారం సంఘం నాయకులు పాల్గొన్నారు.

సర్వే పరిశీలన..

ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి సర్వేను చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి ఆకస్మికంగా సందర్శించారు. సర్వే జరుగుతున్న తీరుని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఐకేపీ ద్వారా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఐకేపీ అధికారులు త్రియంబక్, దర్శనాల శంకర్, కాంగ్రెస్ నాయకులు బుక్యా లక్ష్మణ్, కొత్త సత్తిరెడ్డి, వేల్పుల శ్రీనివాస్ పాల్గొన్నారు.


కిష్టంపేటలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

సద్వినియోగం చేసుకోవాలి

చెన్నూర్‌రూరల్: రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని చెన్నూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే గడ్డం వివేక్ అన్నారు. మండలంలోని కిష్టంపేట గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఐకేపీ ఏపీఎం ప్రమీల, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెళ్లికుమార్తెకు పుస్తె, మట్టెలు పంపిణీ

కాసిపేట: మండల కేంద్రానికి చెందిన పేద మున్నూరుకాపు కుటుంబం పెద్దపల్లి తిరుపతి, లక్ష్మి దంపతుల కుమార్తె ప్రణీత వివాహానికి మున్నూరుకాపు సంఘం మండలాధ్యక్షుడు అగ్గి సత్తయ్య, ప్రధానకార్యదర్శి మిట్ట లక్ష్మణ్‌పటేల్‌ల చేతుల మీదుగా బుధవారం పుస్తె, మట్టెలు, పెళ్లి చీర అందించారు. సంఘం జిల్లా యూత్ నాయకులు రాకం సంతోష్, మండల నాయకులు ఉస్కెమల్ల గోపాల్, మడిపల్లి తిరుపతి, పెద్దపల్లి శంకర్, కాసు సురేందర్, గుర్రాల వేణు, సంఘం నాయకులు పాల్గొన్నారు.

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రానికి చెందిన ఉస్కమల్ల రవి –సత్యవతి కూతురు మనీషా వివాహనికి మున్నూరు కాపు సంఘం కాచీగూడ వారు బహూకరించిన పుస్తెమట్టెలను బుధవారం జిల్లా కేంద్రంలో జిల్లా మున్నూరు కాపు సంఘం పట్టణ అధ్యక్షుడు బొలిశెట్టి కిషన్, జిల్లా కార్యదర్శి బాయిని శ్రీనివాస్, ఉపాధ్యక్షులు పూదరి తిరుపతి అందజేశారు.

శ్రీ వాసవీ భజన బృందం చేయూత..


పుస్తె, మట్టెలు అందజేస్తున్న సభ్యులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మండలం పెద్దదుబ్బ గ్రామానికి చెందిన ఓ నిరుపేద యువతి వివాహానికి బుధవారం శ్రీ వాసవీ భజన బృందం సహాయక సంఘం శ్రేణులు పుస్తె, మట్టెలు అందజేశారు. శ్రీ వాసవీ భజన బృందం సహాయక సంఘం శ్రేణులు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కారుకూరి రాంచందర్ సమక్షంలో వధువు లావణ్య, తల్లిదండ్రులు భాగ్య –యాదగిరికి అందజేశారు. బృందం అధ్యక్షుడు చిలువేరు దయాకర్, ముఖ్యసలహాదారు శ్రీనివాస్, సహాయక కార్యదర్శి జైన శ్రీనివాస్, కాంగ్రెస్ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

రేపు 'జాతీయ గ్రామ్ ఉత్కర్ష్' ప్రారంభం

మంచిర్యాలటౌన్: జిల్లాలోని నస్పూరులో గల జిల్లా సమీకృత జిల్లా కార్యాలయ భవన సమావేశ మందిరంలో ఈ నెల 15వ తేదీన ఉదయం 10 గంటలకు ధర్తీ ఆబా జస్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ పథకం ప్రారంభిస్తున్నట్లు ఏటీడీవో పురుషోత్తం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి జిల్లాలోని అన్ని గిరిజన సంఘాల నాయకులు, మేధావులు, ఉద్యోగులు, రాజకీయ నాయకులు హాజరై విజయవంతం చేయాలని సూచించారు.

రేపు సామూహిక సత్యనారాయణ వ్రతాలు

మందమర్రిరూరల్: పట్టణంలోని మూడో జోన్‌లో గల శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో శుక్రవారం కార్తిక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని సత్యనారాయణ వ్రతాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు ఆచి వరప్రసాదాచార్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం శివపూజ కార్యక్రమం ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

క్రీడాకారిణికి ఆర్థిక సాయం


ఆర్థికసాయం అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

మంచిర్యాలఅర్బన్: ఆత్మీయ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం స్థానిక గాంధీ నగర్‌కు చెందిన క్రీడాకారిణికి రూ.25వేల ఆర్థిక సాయం అందజేశారు. కర్రసాములో ఉత్తమ ప్రతిభ చూపుతున్న శృతి పేదకుటుంబం కావడంతో పంజాబ్‌లో ఎన్‌ఐఎస్ కోచింగ్ తీసుకునేందుకు డబ్బులు లేక ఇబ్బందులు పడుతుంది. ఆత్మీయ చారిటబుల్ ట్రస్టు సభ్యులు స్పందించి శృతికి ఆర్థికసాయం అందించారు. ట్రస్టు గౌరవ అధ్యక్షుడు మహేందర్, అధ్యక్షుడు తిరుపతి, కోశాధికారి సురేశ్, సభ్యులు భూమేశ్, శ్రీనివాస్, అశోక్, తిరుపతి పాల్గొన్నారు.